క్లుప్తంగా

కమిటీ ఎన్నిక



కాటారం: ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ మహాముత్తారం మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీరా డాకునాయక్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా గోక సదానందం, ముఖ్య సలహాదారుడిగా డాకునాయక్, ప్రధాన కార్యదర్శిగా రొడ్డ సురేశ్, ఉపాధ్యక్షులుగా తోట కృష్ణ, గంధం రాజేశ్, కార్యదర్శిగా చిడెం రవీందర్, కోశాధికారిగా పంతకాని సూర్యనారాయణ ఎన్నికయ్యారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు.

ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ కార్యవర్గం..



కాటారం: మహాముత్తారం మండల శాతవాహన ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా తాళ్లపల్లి సుధాకర్, ఉపాధ్యక్షులుగా షాజహాన్, ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్, కోశాధికారిగా నరేశ్, కార్యదర్శిగా నాగరాజును నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భాష, శ్యామ్, శివ, కుమార్, పవన్, దేవేందర్, రాజేశ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ధర్నాపై విమర్శలు చేయడం సిగ్గుచేటు

కాటారం: ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పాలకులకు పట్టించుకోకపోడంతోనే దేవుడికి మొర పెట్టుకోవాల్సి వస్తుందని బీఆర్ఎస్ మండల నాయకుడు జక్కు శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు యూరియా కోసం నానా తంటాలు పడుతుంటే పట్టించుకోని కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ చేసిన ధర్నాపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. సకాలంలో ప్రభుత్వం స్పందించి రైతుల ఇబ్బందులను తొలిగిస్తే దేవుడి విగ్రహానికి మొర పెట్టుకుంటూ ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి వచ్చేది కాదు కదా అని అన్నారు. రాద్ధాంతాలు, విమర్శలు పక్కన పెట్టి రైతుల సమస్యలు తీర్చడంపై కాంగ్రెస్ నాయకులు దృష్టి పెట్టాలని తెలిపారు.

పరామర్శ



కాటారం: మండలంలోని బొప్పారంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మంతెన రాములు మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించి రాములు మృతదేహం వద్ద నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు జక్కు రాకేశ్, జోడు శ్రీనివాస్, ఊర వెంకటేశ్వరరావు, వంగల రాజేంద్రాచారి, రమణ, అశోక్, తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



దేవేందర్ (ఫైల్)

రేగొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగుర్లపల్లి గ్రామానికి చెందిన కుంట దేవేందర్ (38) వ్యవసాయం చేస్తు జీవనం సాగిస్తున్నాడు. అతడు ఆగస్టు 31న పరకాలకు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన గూడ్స్ వాహనం ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దేవేందర్‌ను ఎంజీఎంకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సెకండ్ ఎస్సై త్రిలోక్ రెడ్డి తెలిపారు. మృతునికి భార్య శైలజ, కూతురు, కుమారుడు ఉన్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

వాజేడు: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మొరుమూరు కాలనీ సమీప పొలాల్లో సోమవారం చోటు చేసుకుంది. విద్యుత్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. సిబ్బంది విద్యుత్ లైన్లను పరిశీలిస్తూ వెళ్తుండగా నక్కా నాగేశ్వరావు పొలంలో విద్యుత్ తీగె తెగి పడి ఉండగా దాని సమీపంలో దుక్కిటెద్దు కూడా మృతి చెంది. విద్యుత్ తీగె తెగిన సమయంలో దుక్కిటెద్దు అక్కడికి రావడంతో దానికి తగిలి చనిపోయి ఉంటుందని చెప్పారు. దుక్కిటెద్దు ఎవరికి చెందినదో తెలియరాలేదని తెలిపారు.

నిధులు రావు.. పనులు కావు



చిట్యాలలోని ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న డైనింగ్ హాల్



ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న అదనపు గదులు

- మనఊరు–మనబడి పనులపై అలసత్వం
- పాఠశాలల్లో అసంపూర్తిగా పనులు

చిట్యాల: పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించేదుకు గత ప్రభుత్వం హయాంలో మన ఊరు మనబడి పథకాన్ని ప్రవేశపెట్టారు. మండలంలోని 25 గ్రామాలకు గాను మండల కేంద్రంలోని జూకల్, చల్లగరిగ, గోపాలపూర్, జడలపేట, నైన్‌పాక, చిట్యాల గ్రామాల్లోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. కాగా పాఠశాలల్లో అదనపు తరగతు గదులు, డైనింగ్‌హాల్‌తో పాటు పలు నిర్మాణాలు చేపట్టారు. కొన్ని పాఠశాలలో బిల్లులు రాక కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే ఆపేశారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోవడంతో విద్యార్థులకు సౌకర్యాలు సక్రమంగా లేక అనేక అవస్థలు పడుతున్నారు. జిల్లా అధికారులు ప్రతీ పాఠశాలలను సందర్శించి పనులు చేసేలా కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకువచ్చి పనులు ప్రారంభించారని స్థానికులు తెలుపుతున్నారు. దీంతో వారు అప్పులు చేసి పాఠశాలలో చేసిన పనులకు ఇంతవరకు బిల్లులు రాక పోవడంతో పనులను ఆపేశారని వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

మండలంలో చిట్యాల, జూకల్‌తో పాటు పలు పాఠశాలలోని విద్యార్థులకు అదనపు తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్న కనీసం అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇరవై నెలలు అవుతున్న కనీసం పాఠశాలలపై పట్టించుకున్న పాపాన లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మన ఊరు–మన బడిలో భాగంగా నిర్మించిన తరగతి గదులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

బిల్లులు రాలేదు..



మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో రూ.28లక్షల నిధులతో పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసుతులు కల్పించేందుకు నిర్మాణం చేపట్టా. దీంతో అధికారుల ఒత్తిడితో మేరకు అప్పులు తీసుకవచ్చి కొంత మేరకు పనులను చేశా. చేసిన పనులకు ఇంత వరకు బిల్లులు రాలేదు. సంబంధిత అధికారులకు మొర పెట్టుకున్న ఫలితం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

– కట్కూరి నరేందర్, కాంట్రాక్టర్, చిట్యాల

నాణ్యమైన భోజనం అందించాలి

- ఎంపీడీఓ వీరస్వామి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

కాటారం: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ వీరస్వామి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర సంక్షేమ కళాశాలను ఎంపీడీఓ తనిఖీ చేశారు. రికార్డులు, పరిసరాల పరిశుభ్రత, వంట గది, డైనింగ్ హాల్, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వంట సామగ్రి, కూరగాయల నాణ్యతను చూశారు. పరిసరాలతో పాటు కిచెన్, డైనింగ్ హాల్‌ను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా చూసుకోవాలన్నారు. వర్షాకాలం తగిన జాగ్రత్తలు పాటిస్తూ విద్యార్థులకు భోజనం ఎప్పటికప్పుడు తయారు చేసి పెట్టాలని నిల్వ చేసిన పదార్థాలను వినియోగించవద్దని తెలిపారు. విద్యార్థులతో కలిసి ఎంపీడీఓ భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్, ప్రిన్సిపాల్ రాజేందర్, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలి

- సూపర్‌వైజర్ జయప్రద



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

చిట్యాల: అంగన్‌వాడీ టీచర్లు ప్రతీ రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి నాలుగు గంటల వరకు సమయపాలన పాటించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రద అన్నారు. సోమవారం మండలంలోని నైన్‌పాక సెక్టార్ సమావేశాన్ని మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా జయప్రద మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న టీచర్లు ప్రతి రోజు సమయపాలన పాటించి పిల్లల నమోదు, హాజరు శాతాన్ని పెంచుకోవాలని కోరారు. పిల్లలందరికీ తెలుగు, ఇంగ్లీష్ బోధన నేర్పించాలని అన్నారు. అలాగే విద్యార్థులకు వేడివేడిగా భోజనం తయారు చేసి పెట్టాలని సూచించారు. నెలకోసారి తల్లుల సమావేశం ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే బాల్య వివాహాలు, దత్తత, అనాథ బాల బాలికలను గుర్తించడం, గృహహింస చట్టంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళా ఉత్సవం



కాటారం: ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు



మొగుళ్లపల్లిలో..



టేకుమట్లలో..

కాటారం: కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్‌టీ సమన్వయంతో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో సోమవారం మండల స్థాయి కళా ఉత్సవం–2025 వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రదర్శన కళలు, సాహిత్య కళలు, పలు విభాగాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థుల ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీదేవి మాట్లాడుతూ.. కళా ఉత్సవం కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, కళా నైపుణ్యత వెలికిరావడంతో పాటు భారతీయ సాంస్కృతి, సంప్రదాయలపై వారికి గౌరవం పెరుగుతుందన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయి కళా ఉత్సవం పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సోమలింగం, సునీల్, ఉపాధ్యాయులు సతీశ్, రాజునాయక్, గండు రాజబాబు, నరివెద్ది సత్యం, సుదర్శన్, న్యాయనిర్ణేతలు గొరొజు సంతోష్, రామిళ్ల రాకేశ్, పుల్లూరి నాగేశ్వరరావు, రజనీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో మండల స్థాయి కళా ఉత్సవం పోటీలు ఎంఈఓ లింగాల కుమారస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు నృత్యం, సంగీతం, చిత్రకళ, కథలు వంటి అంశాలలో తమ ప్రదర్శనను కనబరిచారు. అనంతరం అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు సురేందర్, ఉపాధ్యాయులు కల్యాణి, లలిత, ప్రవీణ్, శ్రీకళ, మాధవి, రవి ప్రసాద్, చందర్ పాల్గొన్నారు.

టేకుమట్ల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో మండల స్థాయి కళాఉత్సవం పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు అంకూస్, కృష్ణారావు, తిరుపతి, మోజెస్ ఉన్నారు.

5 నుంచి రిలే నిరాహార దీక్ష

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌కు 500 మీటర్ల పరిధిలోని పెద్దతాడిచర్ల డేంజర్ జోన్ గృహాలను సేకరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్వాసితులతో కలసి ఈనెల 5నుంచి రిలే నిరాహార దీక్ష చేయనున్నట్లు డేంజర్ జోన్ నిర్వాసితుడు తాండ్ర మల్లేశ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. అగస్టు 31లోగా డేంజర్ జోన్‌పై స్పష్టమైన హామీ ఇవ్వాలని కలెక్టర్ కార్యాలయం, కాటారం సబ్ కలెక్టర్ కార్యాయం, స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇప్పటికే వినతిపత్రాలు సమర్పించినట్లు పేర్కొన్నారు. కలెక్టర్, సబ్‌కలెక్టర్ నుంచి డేంజర్ జోన్‌పై ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని చెప్పారు. దీంతో ఇళ్లను సేకరించి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతూ.. తహసీల్దార్ కార్యాలయం ఎదుట శాంతియూత రిలే నిరాహార దీక్షలు చేపట్టునున్నట్లు చెప్పారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

కాటారం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు బత్తుల పుష్పలత స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి పొందడంతో సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల, ఆదర్శనగర్ కాలనీ మహిళలు సన్మానించారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేసి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని ఏఎంసీ చైర్‌పర్సన్ సూచించారు.

మహాగర్జనకు తరలిరావాలి



మాట్లాడుతున్న శ్యాంబాబు

చిట్యాల: హైదరాబాద్‌లో ఈ నెల 9న నిర్వహించే మహాగర్జనకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ మడిపల్లి శ్యాంబాబు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వృద్ధులు, దివ్యాంగులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేయూత పింఛన్లు వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దొడ్డె శంకర్, జిల్లా, మండల నాయకులు నోముల శ్రీనివాస్, ఓదేలు, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణగౌడ్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న రామకృష్ణగౌడ్

టేకుమట్ల: మండలంలోని బూర్నపల్లి గ్రామానికి చెందిన నేరేళ్ల రామకృష్ణ గౌడ్ రాష్ట్రీయ సేవ పురస్కార్ జాతీయ అవార్డు–2025ను హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రిసెర్చ్ స్ఫూర్తి అకాడమి ఫౌండర్, చైర్మన్ ఆకుల రమేశ్ చేతుల మీదుగా సోమవారం అందుకున్నాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నానో యూరియాతో ప్రయోజనాలు

- మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల్



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ, ఏఓ

కాటారం: నానో యూరియా వినియోగించడం ద్వారా రైతులు అనేక ప్రయోజనాలు పొందవచ్చని మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల్ అన్నారు. మండల కేంద్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. నానో యూరియా ప్రయోజనాలను వివరిస్తూ రైతుసేవా కేంద్రాలు, పీఏసీఎస్ గోడౌన్, డీసీఎంఎస్, ఫర్టిలైజర్ దుకాణాల ఎదుట వ్యవసాయశాఖ ద్వారా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఏడీఏ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీపాల్ మాట్లాడుతూ.. యూరియాకు బదులుగా నానో యూరియ వాడకం పెంచుకోవాలని సూచించారు. నానో యూరియా వినియోగించడం ద్వారా పంట దిగుబడి పెరుగుతుందని ఆశించిన ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. పర్యావరణ కాలుష్యం సైతం తగ్గుతుందని తెలిపారు. ఎరువుల దుకాణాల యజమానులు, రైతు సేవా కేంద్రాలు, డీసీఎంఎస్‌ల నిర్వాహకులు నానో యూరియా వాడకంపై రైతులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ పూర్ణిమ, ఏఈఓలు, రైతులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఆర్ఐకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాళేశ్వరం: మండల సమస్యలు పరిష్కరించాలని మహదేవపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ జగన్‌మోహన్‌రెడ్డికి బీజేపీ మండల అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిని 30 పడకల నుంచి 50 పడకలకు పెంచాలన్నారు. అన్నారం బ్యాక్ వాటర్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం చెల్లించి, మళ్లీ ఇలాంటి పరిస్థితి రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి చౌరస్తా వరకు రోడ్ వెడల్పు చేసి సెంటర్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయన్నారు. జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆకుల శ్రీధర్, మాజీ మండల అధ్యక్షుడు సిరిపురం శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షులు అంకరి రాజేందర్, మండల కార్యదర్శులు గుజ్జుల శంకర్, లింగంపల్లి వంశీధర్ రావు, బల్ల శ్రావణ్ కుమార్, కోశాధికారి ఉదారి పూర్ణచందర్, కార్యదర్శి బంధుగుల సంతోష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఓడేటి బాలిరెడ్డి, మండల నాయకులు కన్నెబోయిన ఐలయ్య, దాడిగేలా వెంకటేశ్, ఆడప లక్ష్మీనారాయణ, కొక్కు రాకేశ్, రాకేశ్, హరీష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయితీపై వైద్యం అందించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టు కుటుంబాలకు జిల్లాలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో 50 శాతం రాయతీపై వైద్య సేవలు అందించేలా చొరవ తీసుకోవాలని కోరుతూ.. టీఎస్‌జేయూ జిల్లా నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీఎస్‌జేయూ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోశ్, ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తడుక సుధాకర్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఎవరైనా అనారోగ్యం బారిన పడితే ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు వలీ, గట్టు రవీందర్, వెంకటేశ్వర్లు, కడపాక రవి, జగన్, చంద్రమౌళి, రాజు,కారుకూరి సతీష్,క్యాతం మహేందర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పూజలు



మల్హర్: గణపతి వద్ద కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

మల్హర్: మండలంలోని తాడిచర్ల సమ్మయ్యపల్లి గణపతి మండపం వద్ద సోమవారం మహిళలు సామూహిక కుంకుమార్చన పూజల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అర్చకుడు ప్రహ్లాద్‌శర్మ ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఒకరికి ఒకరు వాయినాలు ఇచ్చుకున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అన్నదానం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పట్టణంలో 16 వార్డు రాంనగర్ సుభాష్ కాలనీలోని శ్రీ బాల వినాయక కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వార్డు మాజీ కౌన్సిలర్, వినాయక కమిటీ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్ ప్రారంభించారు. దుర్గం లింగయ్య, చేని శ్రీనివాస్, నరేష్ సారయ్య, దాసరి వేణు, వినయ్ విజయ్, కిరణ్ శ్రీనివాస్, రాజేశ్ పాల్గొన్నారు.

వెంకటాపురం(ఎం): గణపతి నవరాత్రులను పురస్కరించుకొని ఆరో రోజు సోమవారం మండలంలోని వినాయక మండపాల వద్ద ప్రజలు, భక్తులు పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని రామాలయం వద్ద మాజీ ఎంపీటీసీ పోశాల అనిత వీరమల్లు దంపతులు పూజలు చేశారు. శ్రీరామ యూత్ కమిటీ సభ్యులు అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మామిడిశెట్టి కోటి, రామిడి కర్ణాకర్‌రెడ్డి, భూస గణేశ్, జంగిలి రవి, భూస సాంబయ్య, కందికొండ తిరుపతి, జంగిలి కుమార్ పాల్గొన్నారు.

ఏటూరునాగారం: మండలంలోని క్రాస్‌రోడ్డు గణపతి మండపం వద్ద, గణేశ్‌నగర్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలను స్వీకరించారు. దీంతో గణపతి మండపాల వద్ద భక్తుల సందడి నెలకొంది.

అన్నదానం గొప్పది

ములుగు రూరల్: అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. వీవర్స్ కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద వారాహి రెస్టారెంట్ యజమాని బొమ్మగాని ప్రభాకర్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రాంభించారు. అనంతరం వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, నల్లెల్ల భరత్‌కుమార్, రేవంత్‌యాదవ్, పొడాల ఓంప్రకాశ్, ఇమ్మడి రాజుయాదవ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భజన కార్యక్రమాలు

జిల్లా కేంద్రంలోని గొల్లవాడలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవ మండపం వద్ద ప్రతీ రోజు భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సతీష్ కుమార్ తెలిపారు. నవరాత్రులు ప్రారంభమైన నాటి నుంచి ప్రతి రోజు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అధ్వానంగా రహదారి



రామచంద్రాపురం వద్ద దిగబడిన ఇసుకలారీ

వెంకటాపురం(కె) :వెంకటాపురం, చర్ల ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజు ఒక వాహనం రోడ్డు గుంతల్లో దిగబడుతుందని ప్రజలు వాపోతున్నారు. మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామం నుంచి అలుబాక గ్రామం వరకు సుమారు ఆరు కిలో మీటర్ల దూరం రోడ్డుపై పెద్ద సంఖ్యలో గుంతలు పడ్డాయి. దినికి తోడు మండలంలో కురుసున్న వర్షాలకు గుంతల్లో నీరు నిలబడి వాహనాలు దిగబడుతున్నాయి. రెండు రోజుల క్రితం అత్యవసర సేవల కోసం వెళ్లిన 108 వాహనం గుంతల్లో ఇరుక్కు పోయింది. సోమవారం ఉదయం రామచంద్రాపురం గ్రామ సమీపంలో రోడ్డు మధ్యలో ఇసుక లారీ దిగడి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఇప్పటికైన అధికారులు రోడ్డుకు మరమ్మతు చేసేలా చర్యలు తీసుకోవాని ప్రజలు కోరుతున్నారు.

మొక్కల పెంపకానికి వినతి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న తిరుమల

కాటారం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఉపాధిహామీ పథకంలో భాగంగా మొక్కలు నాటడం కోసం పరిపాలన అనుమతులు ఇవ్వాలని ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతిపత్రం అందజేశారు. మార్కెట్ యార్డులోని 12.09 ఎకరాల భూమిలో పూలు, పండ్లు, ఇతర మొక్కలు నాటితే రైతులకు ఉపయోగపడుతాయని చైర్‌పర్సన్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. చైర్‌పర్సన్ వెంట మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, నాయకులు ఉన్నారు.